జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 14 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 7

## మణుగూరు ఓసీ విస్తరణ
# మళ్ళీ జరగాల్సిందే..!




# చర్ల సీహెచ్‌సీకి కొత్త వైద్య పరికరాలు



- రూ.5.60 లక్షల విలువైన వైద్య పరికరాలు పంపిణీ
- గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం- ఐటీడీఏ పీవో బి. రాహుల్

**చర్ల, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** గిరిజన, గిరిజనేతర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఐటీడీఏ నిధుల ద్వారా చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) రూ.5.60 లక్షల విలువైన వైద్య పరికరాలను అందించినట్లు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్ తెలిపారు. మంగళవారం చర్ల సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ .సాయి వర్ధన్‌కు ఆసుపత్రి అవసరాల నిమిత్తం ఎగ్జామినేషన్ టేబుళ్లు, పరీక్షల కోసం ఫోకస్ లైట్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ప్రసవ గదికి ఎయిర్ కండిషనర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువవుతాయని అన్నారు. చర్ల సీహెచ్‌సీని దశలవారీగా అభివృద్ధి చేసి, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందించిన పరికరాలను

మిగతా 2 లో...




# సింగరేణి కార్మికులకు.. లాభాల ధమాకా!

- ఒక్కొక్కరికి సగటున రూ. 1,53,912 లాభాల వాటా పంపిణీ
- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి.. కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్
- 15 రోజుల్లోగా డిపెండెంట్ నియామకాలు పూర్తి.. మారుపేర్ల సమస్యకూ స్వస్తి
- రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34% (రూ. 596 కోట్లు) కేటాయించిన ప్రభుత్వం
- నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరిట కార్మికులకు సొంతింటి స్థలాల కేటాయింపు
- పండుగ కానుకలను అధికారికంగా ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

## పుష్కరాల పనుల్లో వేగం పెంచి,
# గడువులోగా పూర్తి చేయండి

- ఐటీసీ నుంచి భద్రాచలం వంతెన వరకు రహదారి సుందరీకరణకు వారం రోజుల్లో ప్రణాళిక
- ఆలయ అభివృద్ధి, ఘాట్ల నిర్మాణాలపై కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి సమీక్ష



**భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి వివిధ ప్రాంతాల్లో

మిగతా 2 లో...

## పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా
# కొనసాగుతున్న అమ్మవారి ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్
- అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన పెద్దమ్మ తల్లి అమ్మవారు



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ/ అక్టోబర్ 13, (ప్రజాజ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని కెపి, జగన్నాధపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 11 నుండి నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు మంగళవారం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రాత కాలార్చన ,శ్రీ లక్ష్మీ గణపతి అనుస్థానములు, వేద పారాయణ, నవగ్రహ జపములు

మిగతా 2 లో...

## పుష్కరాల పనుల్లో వేగం పెంచి, గడువులోగా పూర్తి చేయండి...



(మొదటి పేజీ తరువాయి...)

జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్.. స్లాబ్‌లు, రక్షణ గోడలు, మట్టి నింపే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఆలయం నుంచి స్నాన ఘాట్లకు వెళ్లే రహదారిని ప్రస్తుతం ఉన్న 25 అడుగుల నుంచి 30 అడుగులకు విస్తరించే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. గోదావరి ఉత్తర వైపు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల మేర చేపడుతున్న పుష్కర ఘాట్ల నిర్మాణాలను పరిశీలించి, మెట్లు, దిగే ప్రాంతాలు, రక్షణ గోడలను పటిష్టంగా నిర్మించాలన్నారు. పాత గోడలకు ఏర్పడిన పగుళ్లకు మరమ్మతులు చేపట్టాలని, పర్ణశాల వద్ద టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు, ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, జీపీ ఈవో శ్రీనివాస్, దేవస్థానం డీఈ రవీందర్ రావు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా కొనసాగుతున్న అమ్మవారి ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి...)

లాంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పెద్దమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో విజయ కుమార్, ఆలయ అర్చకులు ఎస్పీకి ఆశీర్వచనం అందించి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా మూడవరోజు పెద్దమ్మ తల్లి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో తో పాటు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చర్ల సీహెచ్‌సీకి కొత్త వైద్య పరికరాలు



(మొదటి పేజీ తరువాయి...)

సద్వినియోగం చేసుకుంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు ఈ వైద్య పరికరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు ప్రారంభం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం తగ్గి, స్థానికంగానే వైద్య సేవలు పొందే అవకాశం కలిగిందన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని, రానున్న రోజుల్లో ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడంతో పాటు రోడ్డు నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, వైద్య వసతుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాలను అందించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, డీసీహెచ్ రవిబాబు, డాక్టర్ . సాయి వర్ధన్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికులకు.. లాభాల ధమాకా!

**• ఒక్కొక్కరికి సగటున రూ. 1,53,912 లాభాల వాటా పంపిణీ • 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి.. కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్ • 15 రోజుల్లోగా డిపెండెంట్ నియామకాలు పూర్తి.. మారుపేర్ల సమస్యకూ స్వస్తి • రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34% (రూ. 596 కోట్లు) కేటాయించిన ప్రభుత్వం • నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరిట కార్మికులకు సొంతింటి స్థలాల కేటాయింపు • పండుగ కానుకలను అధికారికంగా ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 13, ప్రజాజ్యోతి :**

దసరా పండుగ వేళ సింగరేణి బొగ్గు గని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ సాధించిన నికర లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రజాభవన్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బ ాబుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. సింగరేణి ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం కింద రూ.596 కోట్లను కార్మికుల లాభాల వాటాగా పంపిణీ చేయనున్నారు. దీనివల్ల సంస్థలోని 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుండగా, ఒక్కో కార్మికుడికి సగటున రూ.1,53,912 దక్కనుంది. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు సంస్థలో పనిచేస్తున్న 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు కూడా ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### »» డిపెండెంట్ ఉద్యోగాలు.. మారుపేర్ల సమస్యలకూ స్వస్తి!

సింగరేణి పరిపాలనలో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అత్యంత సున్నితమైన డిపెండెంట్ ఉద్యోగాలు, పరిపాలనా సమస్యలపై ప్రభుత్వం మానవీయ దృక్పథంతో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ నియామక ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లోగా పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. అలాగే, ఏళ్లుగా నలుగుతున్న 136 నుంచి 170 మంది మారుపేర్ల (నేమ్ ఛేంజ్) సమస్యలను అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా మానవీయ కోణంలో పరిష్కరించాలని నిర్ణయించారు. దీనికితోడు వైద్య పరీక్షల (మెడికల్ ఇన్వివాలిడేషన్) కోసం కార్మికులు కొత్తగూడెం వరకు తిరిగే అవసరం లేకుండా, ప్రతి ఏరియా ఆసుపత్రిలోనే ప్రతి నెలా నిర్ణీత రోజున బోర్డు సమావేశాలు నిర్వహిస్తారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన డిస్మిస్డ్ కార్మికులను వన్–టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే ప్రణాళికతో పాటు, కార్మికుల అలవెన్సులపై పడే ఆదాయపన్నును సంస్థ తరఫున ప్రభుత్వమే చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు.

### »» 'నెహ్రూ హౌసింగ్ కాలనీ' తో ..

కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు మైనింగ్ రహిత సింగరేణి భూములను గుర్తించి ప్రత్యేక లేఅవుట్లు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట 'నెహ్రూ హౌసింగ్ కాలనీ'లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జీఓ నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, ఆక్రమిత నివాస ప్రాంతాల లబ్ధిదారుల జాబితాను నెల రోజుల్లోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

### సంస్థ సాధించిన అసలు లాభమెంత?

ప్రభుత్వం 34 శాతం వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 ఇస్తున్నట్లు ప్రకటించడంపై కార్మిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ, లాభాల లెక్కింపు ప్రాతిపదికపై సాంకేతిక విశ్లేషణ నడుస్తోంది. ప్రభుత్వ ప్రకటన ప్రకారం ఈ ఏడాది రూ.1,754 కోట్ల నికర లాభంలో 34 శాతాన్ని (రూ.596 కోట్లు) లెక్కించి ఇచ్చారు. అయితే, గత ఆర్థిక సంవత్సరాల్లో విస్తరణ ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలను పక్కన పెట్టి, మిగిలిన నిధులపై మాత్రమే వాటాను లెక్కించిన సంగతి తెలిసిందే. ఉదాహరణకు గతంలో రూ.6,394 కోట్ల నికర లాభం వచ్చినప్పుడు విస్తరణకు రూ.4,034 కోట్లు మినహాయించి, మిగిలిన రూ.2,360 కోట్లపైనే వాటాను లెక్కించారు. మరి ఈ ఏడాది ప్రకటించిన రూ.1,754 కోట్లు విస్తరణ కేటాయింపులకు ముందు ఉన్న మొత్తం నికర లాభమా? లేక కేటాయింపులు పోగా మిగిలిన మొత్తమా? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. పంపిణీ చేసిన వాటా మొత్తంతో పాటు, సంస్థ సాధించిన మొత్తం నికర లాభం మరియు విస్తరణ కేటాయింపుల వివరాలను కూడా పారదర్శకంగా వెల్లడిస్తే లెక్కింపుపై ఎలాంటి అనుమానాలు ఉండవని కార్మిక వర్గాలు కోరుతున్నాయి.



# గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి

- **ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న డెవలప్మెంట్ చార్జీలను రద్దు చేయాలి**
- **గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి**
- **సిపిఐఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా**
- **అవినీతి ఆరోపణలపై విచారణ చేసి రిపోర్ట్ అందివ్వాలి... డిపిఓ ని ఆదేశించిన సబ్ కలెక్టర్**



**భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి )** గ్రామపంచాయతీలో నెలకొన్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని భద్రాచలం కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా స్వచ్ఛ పాలన అందించాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ప్లే కార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు కూడా అనేక ఒక తోకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు సైతం బలంగా వినిపిస్తున్నాయని ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాలని నరసారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ... డెవలప్మెంట్ చార్జీల పేరుతో ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న చార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించుకున్న ప్రతి ఇంటికి ప్రభుత్వం అధికారులే సర్వే చేసి ఇంటి పనులు వేయాలని కోరారు. గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులకు వేతనాలను పెంచి సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా వేతనాలు లేక పాశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ పెద్ద పండుగ దసరాకు సైతం వేతనాలు అందకపోతే కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**›› గ్రామపంచాయతీ అవినీతి అక్రమాలపై సబ్ కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల సిపిఐఎం శ్రేణులు హర్షం**

గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా అనంతరం సిపిఐఎం శ్రేణులు ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ మృణాలు శ్రేష్ట వినతి పత్రం అందించారు. సిపిఐఎం ఇచ్చిన వినతి పత్రంపై స్పందించిన సబ్ కలెక్టర్ సమగ్ర రిపోర్టును తనకి ఇవ్వాలని డిపిఓ కి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ గ్రామపంచాయతీ పై జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పారిదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తామని సిపిఎం శ్రేణులకు హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ అవినీతి అక్రమాలపై సబ్ కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల సిపిఐఎం శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంతాన లక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన లక్ష్మీ అమ్మవారు



**భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు మంగళ వారం లక్ష్మీ అమ్మవారు సంతాన లక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంతాన లక్ష్మి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కుటుంబ సౌఖ్యం, సంతాన సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది. దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లోనూ భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.

## ఎస్సై, పోలీస్ శిక్షణకు 100 మంది గిరిజన అభ్యర్థుల ఎంపిక

- **గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు చందన**



**భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):** భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎస్సై, పోలీస్ ఉచిత శిక్షణకు గిరిజన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు చందన తెలిపారు.ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశాల మేరకు పీఈటీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్ పర్యవేక్షణలో మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ధ్రువపత్రాల పరిశీలన, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు.ఈ ఎంపిక ప్రక్రియలో 67 మంది బాలురు, 33 మంది బాలికలు కలిపి మొత్తం 100 మంది గిరిజన అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు చందన వెల్లడించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఏసీఎంఓ రమేష్, పీజీహెచ్ఎం మోతేరు, క్రీడల అధికారి గోపాలరావు, వ్యాయామ సంచాలకులు రాంబాబు, నాగేశ్వరరావు, పార్వతి, కృష్ణారావు, పీఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పైసి రెస్టారెంట్ అక్రమ ఆక్రమణలపై బి ఆర్ ఎస్- టి ఆర్ పి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ /అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి)** బి ఆర్ ఎస్ పార్టీ, టిఆర్పి ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలోని స్పైసి రెస్టారెంట్ అక్రమా నిర్మాణం పై,నిబంధనలకి విరుద్ధంగా రెస్టారెంట్ నిర్వహిస్తూ కార్మికుని పై దాడి చేసిన యజమాని నాగేశ్వరరావు పై చర్యలు తీసుకోవలసిన డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్పైసీ రెస్టారెంట్లో గాంధీ జయంతి రోజు కావాలనే, ఉద్దేశ పూర్వకంగా రెస్టారెంట్ నడిపి మాంసాహారం పెట్టిన విషయం పై,మున్సిపాలిటి డ్రైనేజీ ని కబ్జా చేసి, పాత ఆర్డీవో ఆఫీస్ ని రెస్టారెంట్ పార్కింగ్ గా వాడు కుంటూ, సుమారు 80 మందికి పైగా రెస్టారెంట్ లో పనిచేస్తున్న వారికీ పిఎఫ్, జిఎస్టి ఎగవేతకు పని వాళ్ళ బ్యాంక్ ఖాతాలను వాడుకుంటు, ఫైర్ అనుమతులు, రోడ్డు పై కరెంటు ట్రాన్స్ఫర్మర్ పెట్టిన విషయంపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ ర్యాలీ సుమారు 500 మందితో దమ్మపేట సెంటర్ నుండి నిరసన ర్యాలీ గా వెళ్లి టీజీ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో, మున్సిపాలిటీ కార్పొరేషన్ ఆఫీస్ లో, పట్టణ పోలీస్ స్టేషన్లో వినతి పత్రాలను అందజేశారు, ఈ నిరసన ర్యాలీ లో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, దాసరి నాగేశ్వరరావు, ముత్యల ప్రవీణ్,అలివేలు, గాంధీనగర్ దుర్గ, కుంపటి శివ,సాయి, చెన్నూరి కృష్ణ. టి ఆర్ పి పార్టీ నాయకులు అటికెటి శంకర్, మల్లెల వీరనారాయణ, ఆర్కే పాల్గొన్నారు.



## భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- **భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ లో సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆకస్మిక తనిఖీ**



**భద్రాచలం, అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి):** పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనం కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదేశించారు. బస్టాండ్ లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు.మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించడంతో పాటు, ప్రయాణికులను నేరుగా అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారని తెలిపారు. అందువల్ల బస్టాండ్ లో తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రమైన పరిసరాలు సహా అవసరమైన అన్ని ప్రాథమిక సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని అధికారులకు సూచించారు.ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించే లోపాలు ఏవైనా గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. బస్టాండ్ ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, చల్లని, సురక్షితమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, అన్ని సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జానకిపురంలో వ్యక్తి మృతి.. ఆత్మహత్య కేసు నమోదు

- **అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి**



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి )** :అన్నపురెడ్డిపల్లి మండలంలోని జానకిపురం గ్రామానికి చెందిన నూనె శ్రీనివాసరావు తండ్రి దివంగత కృష్ణయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత కొంతకాలంగా క డుపునొప్పి తదితర ఆరోగ్య సమస్యలతో బా ధపడుతున్న శ్రీనివాసరావు ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో మద్దుకూరు బాలాజీ గుడి సమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గు ర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ లోని ఎం జీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.అక్కడ చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు ఈ నెల 12వ తేదీ రాత్రి 9.58 గంటల సమయంలో మృతి చెం దాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ పి. రవికుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా ఘటనకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## భద్రాద్రి ముద్దుబిడ్డకు అరుదైన గౌరవం

- ఎస్ జి ఎఫ్ ఐ యూ-17 తెలంగాణ ఫుట్‌బాల్ జట్టుకు దొడ్డిపట్ల పునీత్ ఎంపిక
- ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఏకైక విద్యార్థిగా ఘనత




భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రీడా చరిత్రలో భద్రాచలానికి చెందిన దొడ్డిపట్ల పునీత్ అరుదైన ఘనత సాధించాడు. ఎస్ జి ఎఫ్ ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-17 ఫుట్‌బాల్ విభాగంలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఏకైక విద్యార్థిగా నిలిచి భద్రాచలం ఖ్యాతిని చాటాడు. భద్రాచలానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్కే షాపింగ్ మాల్ అధినేత దొడ్డిపట్ల కోటేష్ కుమారుడైన పునీత్ ప్రస్తుతం ఖమ్మం వైరా రోడ్డులోని సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యనభ్యసిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి తెలంగాణ జట్టులో చోటు సంపాదించాడు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో పునీత్ తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. పునీత్ సాధించిన ఈ విజయంపై భద్రాచలం ప్రజలు, వ్యాపార వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. చిన్న వయసులోనే ఫుట్‌బాల్‌లో ప్రతిభ చాటుకుని రాష్ట్ర జట్టుకు ఎంపికైన పునీత్‌ను పలువురు అభినందిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ అద్భుత ప్రదర్శన చేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

## ఎస్పీఎఫ్ అధికారులకు సన్మానం




కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి) పాల్వంచ కేటీపీఎస్ లో ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ గా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు కు ఇటీవల పదోన్నతి రావడంతో తెలంగాణ జెన్కో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ జెన్కో సెక్రటరీ దండోరా శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం కమాండెంట్ కోటేశ్వరరావు ను శాలువాలతో ఘనంగా సత్కరించారు, అదేవిధంగా ఎస్పీఎఫ్ డిఎస్పి చంద్రశేఖర్ ను కూడా ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా దండోరా శ్రీను మాట్లాడుతూ ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ నుండి పదోన్నతి పొంది కమాండెంట్గా పదోన్నతి పొందినందుకు అభినందనీయం అన్నారు. వారు చేస్తున్న విధి నిర్వహణలో మరెన్నో పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర దళిత నాయకులు అలువాల సందీప్, ఫణి, ఆర్టిజన్ నాయకుడు రవి. తోపాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ మండల ఫోటోగ్రఫీ అధ్యక్షులు గా కొత్తపల్లి రాజారావు



కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి) పాల్వంచ మండల ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షులుగా కొత్తపల్లి రాజారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, మంగళవారం మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ సమీపంలో గల ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో పాల్వంచ ఫోటో గ్రాఫర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు, ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శి గా నామ నరేష్, కోశాధికారి గా షేక్ రఫీ లు ఎన్నికైన్నారు. అనంతరం అధ్యక్షులు రాజారావు మాట్లాడుతూ, మండల ఫోటో గ్రాఫర్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఫోటో గ్రాఫర్ల వృత్తి నైపుణ్యాని పెంపొందించుటకు వర్క్ షాప్స్ నిర్వహిస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షులు మైలవరపు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జిల్లపెల్లి నాగరాజు, కోశాధికారి పామర్తి శోభన్ బాబు, ఎలక్షన్ కమిటీ మెంబెర్స్ మోహన్, రాజేష్, రాంబ్రహ్మం, ఫోటో గ్రా ఫర్స్ రాము, కుమార్, దుర్గ ప్రసాద్, వీరబాబు, నరసింహారావులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ను దృష్టిలో పెట్టుకొని వరికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు - కొత్వాల
- ఏల్ నీనో ప్రభావంపై వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు చేసిన డిప్యూటీ సి.ఎం. భట్ట విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- జగన్నాధపురం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న - కొత్వాల





కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 13, (ప్రజాజ్యోతి) ఎల్ నినో ప్రభావం తీవ్రరూపం దాల్చుతున్న ప్రస్తుత తరుణంలో వరికి ప్రత్యామ్నాయ పంటలు, రెండు నెలల కంటే తక్కువ కాలంలో పండే పంటలను వేసుకోవాలని ప్రభుత్వం, అధికారులు సూచిస్తున్నారని, రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు వేసుకోవాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని రైతులకు వివరించేందుకు, సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు లతోపాటు వ్యవసాయ శాఖ అనుబంధంగా ఉన్న అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు తిలకించారు. పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం రైతు వేదికలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో విద్యుత్ వాడకం ఎక్కువ అయిందని, విద్యుత్ తయారీ తక్కువగా ఉన్నందున రైతులు తక్కువ కాలంలో పండే పంటలనే వేసుకోవాలని అన్నారు. డిసెంబర్ నెల నుండి ఎల్ నినో దుష్ఫలితాలు ఎక్కువగా ఉండే ప్రమాద సూచనలను ప్రభుత్వం, అధికారులు చెబుతున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి పి. శంభోశంకర్, ఉద్యానవన శాఖ ఎ.ఇ.ఓ. వి. కోటేశ్వరరావు, విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ పి. కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఎ.ఇ.ఓ.లు. సత్యం, విశాల, పవన్, రైతులు పాల్గొన్నారు.

## నంగారభేరి (ఎల్ హెచ్ పి ఎస్ )రాష్ట్ర కార్యదర్శిగా గుగులోత్ కుశ నాయక్ నియామకం




కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి) నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా పాల్వంచకు చెందిన గుగులోత్ కుశ నాయక్ నియమితులయ్యారు, ఈ సందర్భంగా మంగళవారం ఉషా నాయక్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో అక్టోబర్ 12న నంగారభేరి లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ, రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారన్నారు ఈ సమావేశంలో సమితి వ్యవస్థాపకులు డా. ధారావత్ గణేష్ నాయక్ ను జాతీయ అధ్యక్షుడిగా, రాజ్ కుమార్ నాయక్ ను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. అదేవిధంగా జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించారని, ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమిటీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి తనను తెలంగాణ రాష్ట్ర ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారని తెలిపారు, నియామకు పత్రాన్ని జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ధారావత్ గణేష్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్ నాయక్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు, తనకు ఈ పదవి లభించినందుకు గాను లంబాడ జాతి హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు డా. ధారావత్ గణేష్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్ నాయక్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ సమావేశంలో సుశీలబాయిని జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలిగా, పునీబాయిని తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కుశ నాయక్ ఈ సందర్భంగా తెలిపారు, కుశ నాయక్ ఎంపిక పట్ల పాల్వంచకు చెందిన పలువురు ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# శబరి స్మృతి యాత్రను విజయవంతం చేద్దాం

- ఆదివాసీ జేఏసీ నాయకులతో దేవస్థానం ఈఓ సమావేశం
- ఆదివాసీల ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు చాటి చెప్పడమే లక్ష్యం



భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి): ఈ నెల 26న నిర్వహించనున్న శబరి స్మృతి యాత్ర–2026ను విజయవంతం చేసేందుకు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఈఓ కె. దామోదర్ రావు ఆధ్వర్యంలో ఆదివాసీ జేఏసీ నాయకులు, సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సమాజానికి, భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారికి అనాదిగా ఉన్న అవినాభావ ఆధ్యాత్మిక సంబంధాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై చర్చించారు. శబరి స్మృతి యాత్ర వంటి కార్యక్రమాల ద్వారా ఆదివాసీల ఆధ్యాత్మిక వారసత్వానికి తగిన గుర్తింపు కల్పించడంతో పాటు, వారి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక అనుబంధాన్ని భావితరాలకు తెలియజేయాలని అభిప్రాయపడ్డారు. శబరి స్మృతి యాత్రను విజయవంతం చేయడానికి ఆదివాసీ జేఏసీ నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, భక్తులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో కోరారు. యాత్ర ద్వారా ఆదివాసీ సమాజానికి, భద్రాచలం రామయ్యకు మధ్య ఉన్న ఆధ్యాత్మిక బంధాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర, వార్డు సభ్యులు నిట్టా రాజు, జగ్గా కుమారి, సున్నం ఈశ్వరి, భద్రాచలం ఆదివాసీ సమితి ప్రధాన కార్యదర్శి పాయం రవి వర్మ, ఆదివాసీ జేఏసీ సభ్యులు తెల్లం రమణయ్య, ముర్ల రమేష్, కొండ్రు వీరస్వామి, వీసాల కృష్ణయ్య, జగ్గా పుల్లయ్య, కుంజా సంతోష్, కుంజా శ్రీను, తంబళ్ళ రవి, కొండ్రు సుధారాణి, వీసాల ఉమాదేవి, కణితి రాధ, మిడియం నాగమణి, కోర్సా రవి, ఇర్పా రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చింతకుంట గ్రామం..25 ఏళ్లుగా కనీస వసతులకు దూరం

- కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న ఎంపీడీవో జమలారెడ్డి
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ



**బూర్గంపహాడ్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):** మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన కాలనీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బూర్గంపహాడ్ ఎంపీడీవో కె.జమలారెడ్డి తెలిపారు.మోతె గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట, శ్రీరాంపురం పాయం ఎస్టీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం హౌసింగ్ బోర్డు ఏఈ ఉదయ్‌కిరణ్,మోతె సర్పంచ్ సూరమ్మతో కలిసి ఎంపీడీవో ఆయా కాలనీల్లో పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యల ను అడిగి తెలుసుకున్నారు.కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరతను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

>> 25 ఏళ్లుగా రహదారులు,విద్యుత్ సదుపాయాలు కరువు

చింతకుంటలో సుమారు 25 ఏళ్లుగా నివాసం ఉంటున్నప్పటికీ ఇప్పటికీ రహదారులు, విద్యుత్ తదితర కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నా తమ కాలనీల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో నిత్యజీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులకు వివరించారు. కాలనీల్లో అవసరమైన వసతులు కల్పించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.చింతకుంటలో బోరు నీటిలో సుద్ద వస్తోందని గ్రామస్థులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన నీటి నమూనాలను పరీక్షించి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాలనీల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని,బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శి సావిత్రిని ఆదేశించారు.కాలనీల్లో నెలకొన్న సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఎంపీడీవో జమలారెడ్డి పేర్కొన్నారు.సంబంధిత శాఖల అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, గిరిజనులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోడం రాధాకృష్ణ, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వంద మంది పట్టభద్రులకు ఓ సైనికుడు.. ఎమ్మెల్సీ పోరుకు గులాబీ దళం సిద్ధం

- భద్రాచలంలో పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దిశానిర్దేశం



**భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో పటిష్టంగా పనిచేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం భద్రాచలంలోని తెలంగాణ టూరిజం హోటల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి వంద మంది పట్టభద్రులకు ఒక కార్యకర్తను సమన్వయకర్తగా నియమించినట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదు వివరాలను పార్టీ ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంప్రసాద్, నాయకులు మానే రామకృష్ణ, మండల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్. తెల్లం వెంకట్రావు





**చర్ల, అక్టోబర్ 13:(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు 36 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను కొంతమేర తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లల వివాహ సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందడం వల్ల తల్లిదండ్రులకు కొంత ఊరట లభిస్తుందని ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవ మండపాలలో ప్రత్యేక పూజలు చేసిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల దంపతులు





**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 13,(ప్రజా జ్యోతి)** శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాల్వంచ పట్టణ పరిధి 36వ డివిజన్ లో పలు మండపాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి పాతపాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు సందర్శించి, పూజలు చేశారు.డివిజన్ పరిధిలోని గట్టాయి గూడెం లో భజరంగదళ్ యూత్ ఆధ్వర్యంలో, విద్యుత్ ఎంప్లాయిస్ కాలనీ లో శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో, 36వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జ యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో కొత్వాల పాల్ గొని, పూజలు చేశారు.ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, కొ త్వాల విమలాదేవి, నాయకులు పైడిపల్లి మహేష్, కొండం వెంకన్నగౌడ్, గం ధం వెంకటరామారావు, పట్టా వీరకుమార్, వీరమాచినేని నరేష్, బండి రఘు, జగదీష్, కట్టా దివ్య, కట్టా పుష్ప, కంటెం త్రినాథ్, కదలి శ్రీను పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 13 ,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లాకు చెందిన సాఫ్ట్ బాల్ క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించడం పై జిల్లా కలెక్టర్ అంకిత్ క్రీడాకారులను అభినందించారు, మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ ను కలిసిన క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం అభినందనీయమన్నారు, క్రీడల్లో ప్రతిభను కనబరుస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు , మహారాష్ట్రలోని చత్రపతి శివాజీ నగర్ లో గత నెల 27 నుంచి 30 వరకు నిర్వహించిన 39వ సబ్ జూనియర్ జాతీయ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్లో రుద్రంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కుమారి వర్షిత లు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పథకం సాధించారు, అదేవిధంగా నిజామాబాద్ జిల్లా తరలి కొండ లో అక్టోబర్ 11 -12 తేదీల్లో నిర్వహించిన 11వ



తెలంగాణ రాష్ట్ర అండర్ 13 మినీ సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్లో జిల్లా క్రీడాకారులు రాణించి రజిత పథకం సాధించారు, పదిమంది సభ్యులతో కూడిన రాష్ట్ర జట్టులో ఆరుగురు భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉండటం విశేషం! రజిత పథకం సాధించిన జట్టులో సుడిమల్లకు చెందిన బి అవంతిక బెస్ట్ ఆల్ రౌండర్ గా నిలవగా అదే గ్రామానికి చెందిన సిహెచ్ యశ్వంతి, రామవరానికి చెందిన ఎం జ్ఞానేశ్వరి, కె రిషిత శ్రీ ,కొత్తగూడెం కు చెందిన కె కన్వర్షిని, సుజాతనగర్ సులానగర్కు చెందిన బి పావని, ప్రతిభ కనబరిచారు, ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఎం పరంధామరెడ్డి, కోచ్ పొన్నాల పృథ్వీరాజ్, పిడి కవిత తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్రావుపేటలో ఘనంగా బతుకమ్మ చీరల పంపిణీ

- -150 కుటుంబాలకు పైగా మహిళలకు చీరల అందజేత
- -నాలుగు బతుకమ్మల గద్దెల వద్ద ఎల్ఈడీ లైట్లు బహూకరణ





**పినపాక, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పినపాక మండలం వెంకట్రావుపేట గ్రామంలో సర్పంచ్ సుతారి సింధూజ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 150 కుటుంబాలకు పైగా మహిళలకు చీరలను పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల్లో పండుగ సంతోషాన్ని నింపడంతో పాటు, తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

### ›› సొంత ఖర్చులతో చీరల పంపిణీ

గ్రామంలోని మహిళల పట్ల గౌరవం, ఆప్యాయతను చాటుతూ సర్పంచ్ సుతారి సింధూజ, తన సొంత ఖర్చులతో చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరలు అందజేయడం ద్వారా పండుగ ఆనందాన్ని పంచుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. చీరలు అందుకున్న మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ పనుల పరిశీలన




**చర్ల, అక్టోబర్ 13: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం తేగడ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు. గ్రామానికి చెందిన బర్ల పెద్ద రాజారావు పొలంలో చేపట్టిన ఫారం పాండ్ పనులను పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు.అనంతరం గ్రామంలో ఇంటింటికీ ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంబంధించి స్థలాలను గుర్తించి మార్కింగ్ చేశారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయని, గ్రామంలో నీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో తేగడ సర్పంచ్ జమ్ముల మురళి, ఏపీవో ఉర్సు సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి కొప్పుల సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని అబ్బుగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీ



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి ):** ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అబ్బుగూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జంగిలి వెంకటరత్నం, రైతు సంఘం నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరికీ లేదని నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం రాజకీయ నాయకులకు అనుకూలంగా వ్యవహరించకుండా ప్రజల పక్షాన నిలిచి నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరారు. ప్రజల్లో ఆందోళనకు కారణమవుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి ప్రజాస్వామ్య హక్కులను, ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐలో బతుకమ్మ సంబరాలు





**మణుగూరు క్రైమ్. అక్టోబర్ 13, ప్రజాజ్యోతి** మణుగూరు ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపాల్ ఓ సారంగపాణి బతుకమ్మ పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగన్నారు. అనంతరం విద్యార్థులు రంగు రంగుల పూలతో ఏర్పాటు చేసిన బతుకమ్మలతో ఆడి పాడి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ టి ఎన్ జ్యోతిరాణి, ఏటీవోలు ఎం శ్రీనివాసరావు జీవీ కృష్ణారావు ఏ నర్సయ్య వేణుగోపాల్ నాయుడు, సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటిసి మాస్టర్ ట్రైనర్స్ పూర్ణచంద్రరావు కార్తికేయ లతోపాటు ఏటిసి ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాణికులకు తప్పనున్న తిప్పలు

- వేగంగా డైవర్షన్ రోడ్డు పనులు!



**ములకలపల్లి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి ):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాజుపేట శివారులోని పాల్వంచ-దమ్మపేట ప్రధాన రహదారిపై పాములేరు వాగుపై ఉన్న వంతెన కూలిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా చేపట్టిన సైడ్ డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వంతెన కూలిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా పలు ప్రమాదాలు చోటుచేసుకోగా, ఓ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందడంతో సమస్య తీవ్రత మరింత పెరిగింది. దీంతో ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణంపై దృష్టి సారించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బత్తుల అంజి సమస్యను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ప్రజాప్రతినిధుల చొరవతో డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నెల 5న డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శంకుస్థాపన చేయగా, ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో రెండు, మూడు రోజులలో పనులు పూర్తి చేసి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డైవర్షన్ రోడ్డు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే పాల్వంచ-దమ్మపేట ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. రాకపోకలు సాఫీగా సాగడంతో పాటు ప్రమాదాల ముప్పు తగ్గే అవకాశం ఉంది. పనులను త్వరితగతిన పూర్తి చేసి రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ఒడిశా యువతి మృతిపై వీడని అనుమానాలు

- అస్వస్థతకు గురైతే మరో వ్యవసాయ క్షేత్రానికి తరలించారా... ?

**ములకలపల్లి అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి ):** మండలంలోని గండిప్రోలు శివారులోని ఓ ప్రైవేట్ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన వలస యువతి మృతి ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల దర్యాప్తు తీరుపై స్థానికుల్లో అసంతృప్తి నెలకొంది. శనివారం రాత్రి పురుగుల మందు సేవించిన యువతి ఆదివారం ఉదయం పాల్వంచ ఆసుపత్రిలో మృతి చెందినట్లు సమాచారం. సోమవారం బంధువులు వచ్చిన తర్వాత కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. అయితే ఎఫ్ఐఆర్‌లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యగా పేర్కొన్నప్పటికీ, ఘటనా స్థలాన్ని పోలీసులు నేటి వరకు పరిశీలించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం మృతి చెందితే విషయాన్ని గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అస్వస్థతకు గురైన యువతిని ఆసుపత్రికి తరలించకుండా మరో క్షేత్రానికి తీసుకెళ్లారనే ప్రచారం అనుమానాలకు తావిస్తోంది. కూలి పనులు చేస్తున్న యువతికి ఆర్థిక ఇబ్బందులేంటని, తొమ్మిదేళ్ల క్రితం భర్తకు దూరమైతే ఇప్పుడు కుటుంబ కలహాలేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మధ్యవర్తుల పాత్ర, యజమాని వేధింపులు, పని ఒత్తిడి కోణంలో కూడా దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వచ్చే వలస కూలీల వివరాలు సేకరించడంలో, వారిపై నిఘా ఉంచడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి వాస్తవాలు వెల్లడించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్సై మధుప్రసాద్ ను వివరణ కోరగా సోమవారం పిర్యాదు అందగా పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# మణుగూరు ఓసీ విస్తరణ మళ్లీ జరగాల్సిందే..!

**భద్రాద్రి మణుగూరు ఓసీ విస్తరణ భూ సర్వే చుట్టూ కోట్ల స్కాం తెరలేస్తోంది. సింగరేణి ఆర్అండ్ఆర్ ప్యాకేజీల పేరుతో అసలైన నిర్వాసితులను పక్కన పెట్టి అనర్హులకు ప్యాకేజీలు కట్టబెట్టే కుట్ర జరిగిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రతి అనర్హుడి నుంచి మూడు నుంచి నాలుగు లక్షలు వసూలు చేసి జిల్లా అధికారి పేరు కూడా వాడుకున్నారనే ప్రచారం మణుగూరులో సంచలనంగా మారింది. 1/70 యాక్ట్ ఉన్న ఏజెన్సీలో ప్రభుత్వ భూములు అమ్మడం, కొనడం ఎలా సాధ్యమైందని, ఎల్టీఆర్ కేసు ఎందుకు నమోదు కాలేదని రైతులు నిలదీస్తున్నారు. పాత బాండ్ పేపర్లతో దొంగ పత్రాలు సృష్టించి ములుగు, భద్రాచలం, ఛత్తీస్ గఢ్ నుంచి బాండ్లు తీసుకొచ్చారనే ఆరోపణలు జోరుగా వస్తున్నాయి. ఈ స్కాంలో ఏకంగా కొన్ని మేజర్ పేపర్లు, ఛానళ్లకు చెందిన 20 మంది జర్నలిస్టుల పేర్లు కూడా సర్వే జాబితాలో ఉన్నాయనే ప్రచారం జర్నలిజం పరువును తీస్తోంది. కోట్ల రూపాయలు చేతులు మారిన ఈ సర్వేలో పద్మావతి పాత్ర ఏంటని, ఏసీబీకి చిట్టా మొత్తం విప్పిన ఓ రెవెన్యూ అధికారి ఎవరనే చర్చ మణుగూరులో హాట్ టాపిక్ అయింది. అందుకే మణుగూరు ఓసీ విస్తరణ రీ-సర్వే జరగాల్సిందేనని అసలైన నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.**

- **లేదంటే కోట్లన్నీ దళారులు, అనర్హుల పాలే..!!**
- **ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసమే కోట్ల స్కాం**
- **రెవెన్యూ, సింగరేణి అధికారుల హస్తంతోనే భారీ స్కాం..?**
- **1/70 యాక్ట్ లో భూముల అమ్మకాలు, కొనుగోలు ఎలా సాధ్యం**
- **ఎల్టీఆర్ కేసులు ఎందుకు నమోదు కాలేదు..?**
- **సుమారు ఒక ఎకరం కొనుగోలు చేస్తే 30 లక్షల ప్యాకేజీ..! అనర్హుల లెక్క ఇదే..!!**
- **పాత బాండ్ పేపర్లతో దొంగ పత్రాల సృష్టి**
- **ములుగు, భద్రాచలం, ఛత్తీస్గఢ్, ఖమ్మం, మహబూబాద్, వరంగల్, పరిస్రా ప్రాంతాల దాకా బాండ్ లింకులు**
- **ఓసీ విస్తరణలో జాబితాలో 20 మంది జర్నలిస్టుల పేర్లు..?**
- **మేజర్ పేపర్, ఛానల్ల ముసుగులో విలేకరుల దందా..?**
- **స్కాంలో ఓ పద్మావతి హ్యాపీ.. ఆమె చేతికి కోట్ల రూపాయలు ఎలా వచ్చాయి.. ఆ పద్మావతి వెనుక ఉన్నదేవరు..?**
- **ఏసీబీకి చిట్టా మొత్తం విప్పిన ఓ రెవెన్యూ అధికారి..?**
- **అందుకే తహసీల్దార్ కార్యాలయంకి రావడం బంద్..! రాకపోవాడానికి గల కారణం ఏంటని జనం లోతు చర్చ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 13, ప్రజాజ్యోతి**

మణుగూరు ఓసీ విస్తరణ భూ సర్వే మొత్తం అక్రమంగా జరిగిందని, అసలైన భూ నిర్వాసితులు తక్కువ, అనర్హులు ఎక్కువగా ఉన్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. సింగరేణి ఆర్అండ్ఆర్ ప్యాకేజీల కోసం కోట్ల రూపాయల స్కాం జరిగిందని, ఈ తతంగం అంత రెవెన్యూ, సింగరేణి అధికారుల కనుసన్నల్లోనే జరిగిందని గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. 1/70 యాక్ట్ ఉన్న ఏజెన్సీలో ప్రభుత్వ భూములు, ఎస్టీ భూములను నాన్ ట్రైబ్స్ కొనుగోలు చేయడం, అమ్మడం ఎలా సాధ్యమని, అలా అమ్మితే ఎల్టీఆర్ కేసు ఎందుకు నమోదు కాలేదని ప్రశ్నిస్తున్నారు. పట్టా భూమికి 22.50 లక్షలు, ప్రభుత్వ భూమికి 11.25 లక్షల ప్యాకేజీ ఇస్తుండటంతో ఒక ఎకరం కొనుగోలు చేస్తే ఆ ఇంట్లో ఆరుగురు ఉంటే మొత్తం సుమారు 30 లక్షల ప్యాకేజీ వస్తుందనే లెక్క తో ఈ దందా జరిగిందని తెలుస్తోంది. పాత బాండ్ పేపర్లతో దొంగ పత్రాలు సృష్టించి ములుగు, భద్రాచలం, ఛత్తీస్ గఢ్, పస్రా, వరంగల్, మహబూబాబాద్ నుంచి బాండ్లు తీసుకొచ్చారని వినపడుతోంది. తెచ్చిన ప్రతి బాండ్ ను, ప్రతి ఆ ధార్ కార్డును చెక్ చేస్తే అసలు రూపం మొత్తం బయటపడుతుందని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సర్వే గురించి పిన్ టు పిన్ వివరాలను ఓ రెవెన్యూ అధికారి ఏసీబీకి చెప్పారనే ఫ్లాష్ న్యూస్ తో కూడా సంచలనంగా వినపడుతోంది. స్థానిక ఎమ్మార్వో 15 రోజులుగా ఆఫీస్ కు రావడం లేదని, కొందరు పరారీలో ఉన్నారని ప్రచారం చేస్తుంటే మరికొందరు జ్వరం వచ్చిందని అందుకే ఆఫీస్ కి రావడంలేదని ప్రచారం చేస్తున్నారు. ఈ సర్వేను ఏసీబీ, విజిలెన్స్, ఈడీ అధికారుల సమక్షంలో రీ–సర్వే చేయాలని అసలైన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### ›› సర్వేలో నాన్ లోకల్ వ్యక్తుల పేర్లు...

సర్వే జాబితాలో మణుగూరుకు ఏ మాత్రం సంబంధం లేని నాన్ లోకల్ వ్యక్తులు, బయట రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు మణుగూరు ఓసీ విస్తరణలో పెద్ద ఎత్తున చొరబడ్డారని గిరిజన రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఎన్నడూ మణుగూరులో నాగలి పట్టని వారు, ఓసీ భూముల్లో అడుగు పెట్టని వారు కూడా నిర్వాసితుల జాబితాలోకి ఎలా వచ్చారని నిలదీస్తున్నారు. వచ్చిన వారి ఆధార్ కార్డుల్లో అడ్రస్ లు ఎక్కడివో జిల్లా అధికారులు తెల్చాలంటున్నారు. స్థానికంగా భూములు సాగు చేసుకుంటున్న పేద గిరిజన రైతుల పేర్లు గల్లంతు అయ్యి, బయటి వ్యక్తుల పేర్లు ఎలా నమోదు అయ్యాయో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకే ప్రస్తుతం జరిగిన ఓసీ విస్తరణ సర్వేను పూర్తిగా రద్దు చేయాలని డిమాడ్ చేస్తున్నారు. స్కాంకి సంబందించిన ఆడియో, వీడియో రికార్డ్ లు ఉండటం గమనార్హం.

### ›› పట్టా భూమికి 22.50..! ప్రభుత్వ భూమికి 11.25 లక్షలు..!!

సర్వేలో పట్టా భూమికి 22.50 లక్షలు, ప్రభుత్వ భూమికి 11.25 లక్షల ప్యాకేజీ ఇస్తుండటంతో దీన్ని అడ్డుపెట్టుకుని కొందరు దళారీలు భూ సర్వే దందా చేశారాని తెలుస్తోంది. ఈ స్కాం మొత్తం సింగరేణి ఆర్అండ్ఆర్ ప్యాకేజీల కోసమే జరిగిందనే అనుమానాలు జోరుగా వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, సింగరేణి అధికారుల కనుసన్నల్లోనే ఈ తతంగం అంత నడిచిందనే విమర్శలు వస్తున్నాయి.

### ›› ఓసీ విస్తరణలో జిల్లా అధికారికి వాట ఉందా..?

అభం శుభం తెలియని జిల్లా అధికారి పేరును కూడా వాడుకోని ఆయనకు కూడా వాటా ఇవ్వాలని దళారీలు లక్షలు వసూళ్లు చేశారనే ప్రచారం సంచలనం రేపుతోంది. ఈ వసూళ్లు చేసింది, చేయించింది ఎవరో తేలాలంటే జిల్లా అధికారి రంగంలోకి దిగాలని పలు మేధావులు కోరుతున్నారు. జిల్లా అధికారికి ఎలాంటి వాటా లేకపోతేనే రీ–సర్వే చేపించాలని, లేకపోతే ఈ స్కాంలో వాటా ఉందనే అనుమానం వ్యక్తం అవుతోందని తెలుస్తుంది.

### ›› 1/70లో అమ్మకాలు, కొనుగోలు ఏంటి...

1/70 యాక్ట్ ఉన్న ఏజెన్సీ ఏరియాలో ప్రభుత్వ భూములు, ఎస్టీ భూములను నాన్ ట్రైబ్స్ కొనుగోలు చేయడం, అమ్మకాలు చెయడం ఎలా సాధ్యమవుతుందని గిరిజన రైతులు నిలదీస్తున్నారు. రెవెన్యూ నిబంధనల ప్రకారం ఇలా అమ్మితే ఎల్టీఆర్ కేసు నమోదు కావాలి, కానీ ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం వెనుక రెవెన్యూ అధికారుల హస్తం ఉందనే అనుమానం బలంగా వ్యక్తమవుతోంది. మణుగూరు భూ నిర్వాసితులకే ప్యాకేజీ రావాలి, కానీ బయటి వాళ్లకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఒక అనర్హుడు ఒక ఎకరం పొలం కొనుగోలు చేస్తే ఎకరానికి 11.25 లక్షల పరిహారంతో పాటు, ఆ ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి సుమారు 5.5 లక్షలు వస్తున్నాయని అంటున్నారు. అంటే ఆరుగురు ఉంటే దాదాపు 30 లక్షలకు పైగా వస్తుందని, అందుకే ఆర్అండ్ఆర్ ప్యాకేజీల కోసమే తప్పుడు పత్రాలు సృష్టించి లక్షలు కాజేసే ప్రయత్నం జరుగుతోందని స్పష్టంగా తెలుస్తోంది.

### ›› బాండ్లు పేపర్లు సృష్టించి భూమి కొనుగోలు...

ప్యాకేజీల కోసం పాత బాండ్ పేపర్లను సృష్టించి భూమి కొనుగోలు చేసినట్లుగా చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాలం చెల్లిన బాండ్లు ములుగు, భద్రాచలం, ఛత్తీస్గఢ్, పస్రా, వరంగల్, మహబూబాబాద్ వంటి ప్రాం తాల నుంచి తీసుకువచ్చారని తెలుస్తోంది. ప్రతి బాండ్ ను క్షుణ్ణంగా చెక్ చేస్తేనే బాండ్ డీలర్ పేరు, అడ్రస్, ఎక్కడ కొన్నారు, ఏ తేదీన కొన్నారు అనేది మొత్తం బయటపడుతుందని రైతులు అంటున్నారు. ఆధార్ కార్డులను పూర్తిగా పరిశీలిస్తేనే అసలు రూపం బయటపడుతుందని డిమాండ్ చేస్తున్నారు.

### ›› సర్వేలో 20 మంది విలేకరుల పేర్లు..?

ఈ సర్వేలో కొన్ని మెయిన్ పేపర్లు, మెయిన్ ఛానళ్లకు చెందిన ఓ 20 మంది విలేకరుల పేర్లు కూడా ఓసీ విస్తరణలో నమోదు అయ్యాయనే ప్రచారం జర్నలిజం వర్గాల్లో కలకలం రేపుతోంది. తమ పేర్లు ఎక్కించకపోతే వార్తలు రాస్తామని అధికారులను బెదిరించారని కూడా వినిపిస్తోంది. వార్తలు రాయడం పక్కన పెట్టి మేజర్ పత్రిక, మేజర్ ఛానల్ అంటూ దందాలకు పాల్పడుతున్నారని స్థానిక విద్యావంతులు ఆరోపిస్తున్నారు. ఓసీ విస్తరణ జాబితా బయటపడితే ఆ విలేకరులను ఆయా సంస్థల నుంచి పూర్తిగా తొలగించాలని కూడా మేధావులు డిమాండ్ చేస్తున్నారు. ఆ 20 మంది విలేకరుల పేర్లు బహిరంగంగానే బయటపెట్టాలని రైతులు అధికారులను నిలదీస్తున్నారు.

### ›› ఓ పద్మావతి హ్యాపీ.. లక్షల రూ. చేతుల్లో...

ఓసీ విస్తరణ భూ సర్వేలో ఓ పద్మావతి అనే ఓ మహిళా హ్యాపీగా ఉన్నారని, ఆమె చేతికి కోట్ల రూపాయల కట్టలు కట్టబెట్టారని కూడా తెలుస్తోంది. సర్వే పేరుతో ఆమెకు కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని, ఈ సర్వేకు ఆమెకు ఏం సంబంధం ఉందని, అసలు ఆమెను ఈ సర్వేలోకి ఎవరు దించారనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ స్కాం లో "పిన్ టు పిన్" ఏం జరిగిందో ఓ రెవెన్యూ అధికారి ఏసీబీ అధికారులకు చెప్పారనే ఫ్లాష్ న్యూస్ మణుగూరులో వినిపిస్తోంది. ఈ చిట్టా మొత్తం ఏసీబీ చేతిలో ఉందని అనుమానంతోనే స్థానిక ఎమ్మార్వో 15 రోజులుగా ఆఫీస్ కు రావడం లేదని వినపడుతోంది. కొందరెమో జ్వరం పేరుతో ఇంట్లోనే ఉంటున్నారని అంటుంటే, మరికొందరు పరారీలో ఉన్నారని ప్రచారం చేస్తున్నారు. అసలు తహసీల్దార్ ఆఫీస్ కి ఎందుకు రావడం లేదు, ఏం జరిగిందో విషయాలు తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా జిల్లా ఉన్నతాధికారులు రంగంలలోకి దిగితేనే అసలు అవినీతి మొత్తం బయటపుడుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

